# అతిథి దేవోభవ

ఉదయం ఏడు గంటల వేళ కిచెన్‌లో టిఫిన్ రెడీ చేస్తోంది పార్వతి. ఇంతలో కాలింగ్‌బెల్ మోగడంతో వెళ్లి డోర్ తెరిచింది. ఎదురుగా ఎవరో అపరిచిత వ్యక్తి... వయసు ఏభై ఏళ్లు ఉండవచ్చు. అతని వదనంలోకి పరిశీలనగా చూసింది పార్వతి. పూర్తిగా అపరిచితమైన వ్యక్తిలా అనిపించలేదు. ఎప్పుడో ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం వస్తోంది.

"మీరు...? మిమ్మల్ని ఎక్కడో చూసినట్లు ఉంది..." అతనిని గుర్తు చేసుకుంటున్నట్లుగా ఫీలింగ్ పెట్టి అడిగింది.

"నేనమ్మా పార్వతీ! కుటుంబరావుని. ఇరవై ఐదేళ్ల క్రితం మీరూ మేమూ విజయవాడలో ప్రక్క ప్రక్క పోర్షన్లలో ఉండేవాళ్లం. నన్ను గుర్తు పట్టలేదా?" అన్నాడు నవ్వుతూ ఆ వ్యక్తి.

"అవును అన్నయ్యగారూ...! ఇప్పుడు గుర్తు వస్తోంది. మీరు బాగా మారిపోయారు. లోపలికి రండి. కూర్చోండి" అంటూ ఆహ్వానించింది.

కుటుంబరావు తన సూట్‌కేస్‌తో లోపలికి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. పార్వతి అతని వైపు అలానే రెండు క్షణాలు చూసింది. అతను హైదరాబాద్ ఎందుకు వచ్చాడో చెప్పమన్న అర్థం ఇమిడి ఉంది ఆ చూపులో. కుటుంబరావు తను వచ్చిన పని ఆమె ముందుంచాడు.

"అమ్మా పార్వతీ! ఆఫీస్ పనిమీద హైదరాబాద్ వచ్చాను. రెండురోజులు మీ ఇంట్లో ఉండాల్సి వస్తుంది. పని అయిపోగానే వెళ్లిపోతాను. హైదరాబాద్‌లో తెలిసినవాళ్లెవరైనా ఉన్నారా? అని ఆలోచించాను. వెంటనే మీరు గుర్తుకువచ్చారు. నువ్వు ఏమీ అనుకోకపోతే ఈ రెండు రోజులూ మీ ఇంట్లో ఉంటాను" అభ్యర్థిస్తున్నట్లుగా అన్నాడు కుటుంబరావు.

కుటుంబరావు మాటలకు పార్వతి గుండెల్లో రాయిపడింది. మెదడుకు పదునుపెట్టి చురుగ్గా ఆలోచించింది.

"ఈ కుటుంబరావు రెండు రోజులు తనింట్లో ఉంటే ఖర్చుకు ఖర్చు, పనికి పనీ ఎక్కువైపోతాయి. ఏదో వంక చెప్పి అతనిని వెళ్లగొడితే బావుంటుంది" అనుకుంటూ ఆలోచిం చిన పార్వతికి తళుక్కున ఒక ఆలోచన వచ్చింది.

"సారీ అన్నయ్యగారూ! మావారు కేంప్ వెళ్లారు. నేనూ మా అమ్మాయీ మరో గంటలో బయలుదేరి బంధువుల ఇంటికి గుంటూరు వెళ్లబోతున్నాము. ఏమీ అనుకోకండి..." అంది.

పార్వతి మాటలకు మనసులో నొచ్చుకున్నాడు కుటుంబరావు. "పర్లేదులేమ్మా! మరెక్కడికైనా వెళతాను" అంటూ లేచాడు.

"టీ తీసుకొని వెళ్లండి అన్నయ్యగారూ!" అంటూ టీ కప్పు అందించింది పార్వతి.

టీ సిప్ చేస్తూ "అవును పార్వతీ! అప్పట్లో మీ చెల్లెలు జానకి తరచూ మీ ఇంటికి వస్తూ,

జి. మేరీకృపాబాయి

దేది. చాలా కలుపుగోలుగా మాట్లాడేది. ప్రస్తుతం ఆమె ఎక్కడ ఉంటోంది?" ప్రశ్నించాడు కుటుంబరావు.

"ప్రక్క వీధిలోనే ఉంటోంది" సమాధానమిచ్చింది పార్వతి.

టీ తాగి అక్కడి నుంచి నిష్క్రమించాడు కుటుంబరావు.

"మమ్మీ! ఆ అంకుల్‌కి మనం ఊరు వెళుతున్నట్లు అబద్ధం చెప్పావెందుకు?" ఆశ్చర్యంగా అడిగింది కూతురు స్వప్న.

"నీకు తెలీదులే స్వప్నా! రెండురోజులుంటారు... ఎన్ని రోజులుంటారో తెలియదు. అతన్ని మనింట్లో ఉంచుకుంటే చాకిరీ ఎవరు చేస్తారు? ఖర్చు ఎవరు పెట్టుకుంటారు? అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరమే మేలు. అందుకే చిన్న అబద్ధం చెప్పి అతనిని వదిలించుకున్నా" అంది పార్వతి.

ఇంతలో స్నానం ముగించుకొని బాత్రూమ్ నుంచి బయటికి వచ్చాడు పార్వతి భర్త రాజశేఖరం.



"ఏమిటి పార్వతీ... వదిలించుకున్నాను అంటున్నావ్?" అంటూ ప్రశ్నించాడు.

జరిగిన విషయం చెప్పింది పార్వతి.

"అరె! అలా ఎందుకు చేసావు? రెండు రోజులు అతను మనింట్లో ఉంటే నష్టమేమిటి? ఎప్పుడైనా మనకు విజయవాడలో పనుంటే వాళ్లింట్లోనే కదా ఉండేవాళ్లం!" అన్నాడు రాజశేఖరం.

"మమ్మీ ఎప్పుడూ ఇంతే డాడీ! ఎవరినీ ఇంట్లో ఉండనివ్వదు" విసుక్కుంది స్వప్న.

"స్వప్నా! ఇవన్నీ నీకెందుకు? నువ్వు పరీక్షలకు ప్రిపేరవ్వు. ఈ సంవత్సరమైనా నీకు ఉద్యోగం వస్తుందో లేదో. ఈ సంవత్సరమైనా నీకు పెళ్లవుతుందో లేదో" అంటూ కిచెన్‌లోకి దారితీసింది పార్వతి.

టిఫిన్ తయారుచేస్తూ ఆలోచనలో పడింది పార్వతి. "హైదరాబాద్ వచ్చిన దగ్గర నుంచీ అనుకోకుండా వచ్చే అతిథుల బాధ ఎక్కువైపోయింది. ఏదో ఒక బీరకాయ పీచు... వెళ్లగొట్టడానికి వంకలు వెతకలేక తన తలప్రాణం తోకకు వస్తోంది. తీరా ఏదో ఒక వంక చెప్పి వాళ్లను పంపించినా... ఇంట్లో భర్తా, కూతురూ తనపై చిరాకుపడటం..." మనసులోనే అనుకుంది పార్వతి.

ఇంతలో పార్వతి భర్త రాజశేఖరం కిచెన్‌లోకి వచ్చాడు.

"ఏమండీ! మూడు సంవత్సరాలుగా మనమ్మాయి స్వప్నకు పెళ్లి సంబంధాలు చూస్తున్నాం. ఒక్కటీ కుదరడం లేదు. కట్నం తక్కువని కొందరు. అమ్మాయికి ఉద్యోగం ఉండాలని కొందరూ తిరస్కరించి వెళ్లిపోతున్నారు. అమ్మాయి పెళ్లి గురించి నాకు దిగులు ఎక్కువైపోతోంది. మీరు మరికాస్త శ్రద్ధగా సంబంధాలు వెతకాలి" బాధగా అంది పార్వతి.

"అవును పార్వతీ! నా బాధా అదే. మంచి సంబంధం దొరకడమంటే మాటలా? పెళ్లిళ్ల పేరయ్యలు, మ్యారేజ్ బ్యూరోలూ తెచ్చే సంబంధాలు ఎంతవరకూ నమ్మకం? ఆ సంబంధాల్లో ఉన్న లోపాలు, లోటుపాట్లు మనకు ఖచ్చితంగా తెలవు. నాకు తెలిసిన వారందరికీ అమ్మాయి గురించి చెబుతున్నాను. ఫలితం మాత్రం లేదు" మరింత బాధగా అన్నాడు రాజశేఖరం.

"అమ్మాయి స్నేహితురాళ్లందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. మనమ్మాయికి ఎప్పటికి పెళ్లవుతుందో ఏమిటో?" దిగులుగా అంది పార్వతి.

పార్వతీ! నువ్వు దిగులుపడకు. ఈ రోజు నుంచీ నేను అదే పని మీద ఉండి అమ్మాయికి పెళ్లి సంబంధాలు వెతుకుతాను. ఈ సంవత్సరం ఏమైనా సరే స్వప్నకి పెళ్లి చేసెయ్యాలి" ధృఢంగా అన్నాడు రాజశేఖరం.

"ఎప్పటికప్పుడు ఇలానే అనుకుంటున్నాం. ప్రయోజనం శూన్యం" నిరుత్సాహంగా అంది పార్వతి.

"అవును పార్వతీ! మీ చెల్లెలు జానకి కూతురు కీర్తికి కూడా సంబంధాలు చూస్తున్నట్లున్నారు" అన్నాడు రాజశేఖరం.

"వాళ్లతో మనం మాట్లాడటం మానేసి ఐదేళ్లు కావస్తోంది. వాళ్ల విషయాలు నాకు ఏమీ తెలీవు. తెలుసుకోవాలనే ఉత్సాహం కూడా లేదు" విసుగ్గా అంది పార్వతి.

కాలచక్రంలో మరో నెల గడిచింది.

ఆ రోజు ఆదివారం కావడంతో పార్వతి, రాజశేఖరం, స్వప్న తీరికగా కూర్చొని టి.వి.

చూస్తున్నారు. కాలింగ్‌బెల్ మోగడంతో పార్వతి వెళ్లి డోర్ తెరిచింది.

ఎదురుగా చెల్లెలు జానకి... చేతిలో శుభ లేఖలతో నిలబడి ఉంది.

ఆశ్చర్యంగా జానకివైపు చూసింది పార్వతి.

అక్కా! ఏవో కుటుంబ కలహాలవల్ల మీరు మాతో మాట్లాడడం మానేసి చాలా కాలమైంది. కానీ శుభకార్యం పెట్టుకొని కూడా మౌనంగా ఉండలేకపోతున్నాను. బాంధవ్యాల్ని తెంచుకో లేకపోతున్నాను" అంది జానకి.

"శుభకార్యమేమిటి?" అంది పార్వతి జాన కి వైపు సూటిగా చూడకుండానే. స్వప్న, రాజ శేఖరం శుభకార్యమేమిటా అన్నట్లు జానకివైపే చూస్తున్నారు.

"వచ్చే పదోతారీఖున మా అమ్మాయి కీర్తి పెళ్లి. మీరంతా తప్పకుండా రావాలి" అంటూ శుభలేఖ అందిస్తూ.


ఆత్రుతగా పార్వతి ఆ శుభలేఖ అందుకొని వరుడి పేరు చూసింది. వరుడు డాక్టర్ సతీష్ చంద్ర అని ఉంది. వరుడి తండ్రి పేరు చూసింది. కుటుంబరావు అని ఉంది.

"కుటుంబరావు అంటే...?" అంటూ ఆగింది పార్వతి.

"అక్కా! నెలరోజుల క్రితం కుటుంబరావు గారు అనే అనుకోని అతిథి మా ఇంటికి వచ్చారు. ఆయనకు ఈ వూరిలో ఏదో పని ఉండి వచ్చారు. రెండురోజులు మా ఇంట్లో ఉన్నారు. మా అమ్మాయి కీర్తిని చూసారు.




డా॥ బెజవాడ గోపాలరెడ్డి శతజయంచి సందర్భంగా నెల్లూరులో సృజన సాంస్కృతిక సంస్థ ఏర్పాటు చేసిన సభలో ఆంధ్ర సాహితీ క్షేత్రంలో పశ్చిమ గోదావరి, మహిళ నాడు-నేడు, కంపల్సరీ, కలం యోధులు, గ్రంధకర్తలు-గ్రంధాలు, జగన్నాధ రధచక్రాలు మరియు కథా జగన్నాథ్, సాహితీ ప్రస్థానంలో కూచిబొట్ల అనే గ్రంధాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో దగ్గుపాటి రాధాకృష్ణ. వి. బలరామయ్య నాయుడు, శనగవరపు బాలసుబ్రహ్మణ్యం, ఆచార్య ఆదిత్య, బి.వి. నరసింహం, పాతూరి అన్నపూర్ణ, రచయిత కె.యస్.ఆర్.కె.వి.వి. ప్రసాద్, యం. వెంకటరెడ్డి.




కీర్తి ఆయనకు బాగా నచ్చింది. వెంటనే ఆయన వాళ్ల అబ్బాయి సతీష్‌చంద్ర గురించి చెప్పారు. సతీష్‌చంద్ర డాక్టరని, మేము ఇష్ట పడితే పైసా కట్నం లేకుండా కీర్తిని తన కోడలిగా చేసుకుంటాననీ అడిగారు. మేము అంగీకరించాం. కార్యక్రమాలన్నీ చకచకా జరిగి పోయాయి. ఈ సంబంధం కుదరడం కీర్తి అదృష్టం, మా అదృష్టం. అనుకోని అతిథి ఇలా విలువైన వరాన్ని ఇచ్చి వెళ్లాడు" అని చెప్పి, శుభలేఖ ఇచ్చి వెళ్లిపోయింది జానకి.

జానకి మాటలకు పార్వతి, రాజశేఖరం, స్వప్న విస్తుపోయారు. పార్వతి ఏవేవో ఆలోచనలలో పడిపోయింది.

"చూసావా పార్వతీ! పెద్దలు 'అతిథి దేవో భవ' అని ఊరికే అన్నారా? నీకు ఇప్పటికైనా అర్థమైందా? అతిథి దేవునితో సమానం. ఏ అతిథి ఏ వరాలు ఇస్తాడో ఎవరికెరుక? ఇంటికి వచ్చే అతిథివల్ల మనకు ఎన్నో లాభాలు చేకూరవచ్చు. లేదా మనవల్ల ఆ అతిథికి లాభాలు చేకూరవచ్చు. అతిథి మనకు చక్కటి సలహాలు చెప్పవచ్చు. ఏవైనా వివరాలు అందించవచ్చు, మనకు తెలీని ఎన్నో విషయాలు అతిథుల ద్వారా మనం తెలుసుకోవచ్చు. మన అతిథి మనకు, మనం మన అతిథికి ఉపయోగపడవచ్చు. అతిథుల వల్ల హ్యూమన్ రిలేషన్స్ మెరుగుపడతాయి" రాజశేఖరం పార్వతికి హితబోధ చేసాడు.

"పార్వతీ! నిజానికి కీర్తి కంటే మన స్వప్న ఎంతో అందంగా ఉంటుంది. కీర్తి కంటే స్వప్న క్వాలిఫికేషన్స్ కూడా ఎక్కువే. ఆ కుటుంబరావు గారిని నువ్వు మనింట్లో ఉండనిస్తే ఆయనకు తప్పకుండా మన స్వప్న నచ్చేది. కానీ ఆ అతిథి దేవుడిని నువ్వు వరాలు ఇవ్వ కుండా తరిమేసావు. జానకి మంచితనంతో అతిథి దేవుణ్ణి ఆహ్వానించింది. వరాలను అందుకొంది" అన్నాడు రాజశేఖరం.

సత్యాన్ని గ్రహించిన పార్వతి సిగ్గుతో తల దించుకుంది. ●